కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -189 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 21-07-2026 మంగళవారం పేజీలు : 4

# విభజనపై పోరు

కేంద్రం వద్ద 49 డిమాండ్లు

రేవంత్ సర్కార్ దండయాత్ర

మెట్రో-2పై నిర్ణయం ఎప్పుడు?

ఆర్ఆర్ఆర్‌కు ఎదురుచూపులు

మూసీకి కేంద్ర సాయం కోరుతూ

హైవేలు..ఎయిర్‌పోర్టుల ప్రతిపాదనలు

బయ్యారం స్టీల్ ప్లాంట్ డిమాండ్

పార్లమెంట్‌లో తెలంగాణ అజెండా



**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లయినా నేటివరకు విభజన సమస్యలు పరిష్కారం కాలేదు. దీనికి తోడు మరిన్ని సమస్యలు రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయి. కేంద్రం వద్ద రాష్ట్రం ప్రతిపాదించిన అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాలపై నిలదీయడానికి రాష్ట్రంలోని అఖిలపక్ష ఎంపీలతో సీఎం రేవంత్ ఇప్పటికే సమావేశం నిర్వహించారు. కేంద్రం వద్దనున్న పెండింగ్ అంశాలు, వాటి వివరాలన్నింటినీ ఎంపీలకు వివరించారు. ఇంకేదైనా వివరాలు అందించడానికి ప్రత్యేకంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రాష్ట్రం తరఫున ప్రత్యేక అధికారిని అందుబాటులో ఉంచనున్నట్టు ఇప్పటికే సీఎం ప్రకటించారు. ఇందుమూలంగా గతంలో కంటే ప్రభుత్వ సమాచారం ఎంపీలకు సులువుగా లభ్యం కానుంది. కేంద్రం వద్ద రాష్ట్రానికి సంబంధించి 11 శాఖల పరిధిలో 49 అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని సీఎం.. ఎంపీలకు వివరించారు. అత్యధికంగా విద్యుత్, సింగరేణిలకు సంబంధించిన అంశాలే పెండింగ్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు.

మెట్రో సెకండ్ ఫేజ్‌కు అనుమతి

అలాగే.. మెట్రో రెండోదశకు రావాల్సిన అనుమతి గురించి తెలిపారు. మొదటి దశ అంచనా వ్యయాన్ని పరిశీలించి నివేదిక ఇచ్చిన తరువాత రెండో దశకు ముహూర్తం ఖరారు కానుంది. ఈ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని ప్రభుత్వం ఆరోపిస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ పార్లమెంట్?సమావేశాలు పూర్తయ్యేలోగా కమిటీ ఏర్పాటు చేసి అంచనాలను ప్రారంభించాలని కోరుతున్నారు. రెండోదశలో మొత్తం 123 కి.మీ. మేర కేంద్రం అనుమతి ఇవ్వాల్సి ఉంది. మూసీ పునరుజ్జీవానికి కేంద్రం ఇప్పటికే రక్షణశాఖ భూమిని కేటాయించింది. ఈ ప్రాజెక్టు అయ్యే వ్యయంలో 60 శాతం గ్రాంట్ రూపంలో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. హైదరాబాద్?సీవరేజీ ప్రాజెక్టుకు రూ.17,212 కోట్ల సాయం అందించాని కోరింది. సీఎం రేవంత్? 2024 అక్టోబరు 6న ప్రధాని మోడీకి లేఖ కూడా రాశారు. ఆ తర్వాత ఆర్అండ్ బీ, మున్సిపల్, వ్యవసాయం, ఆర్థిఖ శాఖలకు సంబంధించిన అంశాలు సైతం పెండింగులో ఉన్నాయని.. ఎంపీలకు వివరించారు. దీనిలో ప్రధానంగా ఆర్ఆర్ఆర్ 350 కి.మీ. మేర నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. దీనికి అనుమతి రావాల్సి ఉంది. నిర్మాణానికి రూ.34,367 కోట్లు అవసరం అవుతాయని కేంద్రానికి రాష్ట్ర సర్కారు తెలిపింది. ఉత్తరభాగానికి సంబంధించి 1,918 హెక్టార్ల భూమి అవసరం కాగా ఇందులో 1,833 హెక్టార్ల భూమిని ఇప్పటికే సేకరించారు. దక్షణ భాగానికి ఆమోదం లభిస్తే త్వరగా భూసేకరణ పూర్తి చేస్తామని రాష్ట్రం ఇప్పటికే కేంద్రానికి విన్నవించింది.

హైవేలు, ఎయిర్‌పోర్టులు..

హైదరాబాద్ నుంచి బందర్ పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేను మంజూరు చేయాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ ఇటీవల కోరారు.

మిగతాది 2 లో..

## ప్రభుత్వానికి వాంగ్‌చుక్ డిమాండ్లు

మూడు షరతులతో దీక్ష విరమణకు సిద్ధం


నీట్ లీక్‌పై పార్లమెంట్‌లో చర్చ కోరిన సోనమ్

రాజకీయ నేతల హామీ కోరిన విద్యావేత్త

పార్లమెంట్ మార్చ్‌తో ఢిల్లీలో ఉద్రిక్తత

లాఠీచార్జ్‌తో చెదరగొట్టిన పోలీసులు

రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు




**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలో వైఫల్యాలపై గత 20 రోజులకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన దీక్షను విరమించడానికి మూడు షరతులను విధించారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో తనను అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ ఆయన చేతిరాతతో రాసిన ఒక లేఖను తాజాగా ఆయన ఎక్స్ వేదికగా విడుదల చేశారు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు తన షరతులను నెరవేరిస్తే ఈరోజే దీక్షను విరమించడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

## దీక్ష విరమించిన అభిజీత్ దిప్కే!




## చార్ ధామ్ యాత్ర నిలిపివేత

భారీ వర్షాల ఎఫెక్ట్

48 గంటల హై అలర్ట్

భక్తులకు సురక్షిత వసతి

రూట్లు సేఫ్ అయితేనే అనుమతి


పుకార్లను నమ్మొద్దు

ప్రభుత్వ అడ్వైజరీనే ఫాలో అవ్వాలి




**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** ఉత్తరాఖండ్ లో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు రాగల 48 గంటల్లోను భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. దీంతో వాతావరణ పరిస్థితులు క్షీణించడంతో చార్ ధామ్ యాత్ర భక్తుల ముందస్తు రక్ష, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన చార్ ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది.

## విరాళాల కేసుపై సుప్రీం కీలక ఆదేశాలు




సమగ్ర దర్యాప్తు జరపాలని స్పష్టం

సీనియర్ ఐపీఎస్‌తో సిట్ పునర్వ్యవస్థీకరణ సూచన

రాజకీయాలకు కోర్టులు వేదిక కావు

విరాళాలపై రాజకీయం చేయొద్దన్న ధర్మాసనం

సిట్ నివేదిక సమర్పించనున్న యూపీ సర్కార్

జులై 27కు విచారణ వాయిదా

## డెంగ్యూకు తొలి వ్యాక్సిన్




డీసీజీఐ గ్రీన్ సిగ్నల్‌తో కీలక ముందడుగు

4 నుంచి 60 ఏళ్ల వారికి వ్యాక్సిన్

రెండు డోసులతో డెంగ్యూకు రక్షణ

నాలుగు వైరస్ రకాలపైనా సమర్థత

40కిపైగా దేశాల్లో ఇప్పటికే వినియోగం

తీవ్రత తగ్గుతుందన్న వైద్య నిపుణులు

## పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



హైదరాబాద్‌లో లక్ష ఫ్లాట్లు

26 నియోజకవర్గాల్లో నిర్మాణం

స్థలం లేనివారికే ప్రాధాన్యం

ఉండే ప్రాంతంలోనే ఇల్లు

తొలి విడతలో 13 వేల ఇళ్లు

పేదల సొంతింటి కల సాకారం

**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** హైదరాబాద్ నగరంలోని పేదల సొంతింటి కలను సాకారం చేసేలా తెలంగాణ ప్రభుత్వం మరో పథకం ప్రారంభించింది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అజారుద్దీన్ కలిసి ప్రారంభించారు. ఈ పథకం కింద క్యూర్ పరిధిలోని 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇల్లు, స్థలం లేని అల్పాదాయ వర్గాల కోసం టవర్ల రూపంలో ఇండ్ల నిర్మాణం ప్రభుత్వం చేపట్టబోతోంది. ఒక్కో టవర్ లో 10 ఫ్లోర్లు, అంతస్తుకు 12 ఫ్లాట్లు నిర్మించేలా ప్రణాళి సిద్ధం చేసింది. ఇందుకోసం జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరిలో లక్ష ఫ్లాట్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ భూముల్లో ఈ టవర్లను హౌసింగ్ బోర్డు నిర్మించనుంది.

## ప్రజాస్వామ్యంపై దాడి

మోడీ ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు

విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన కాంగ్రెస్

రామాలయ విరాళాల చోరీపై ప్రధానికి ప్రశ్నలు

చోరీ ఘటనకు మోడీ బాధ్యత వహించాలి

ప్రతిపక్షాలపై బలప్రయోగం తగదని హితవు

ప్రభుత్వానికి దమ్ము లేదంటూ ఘాటు వ్యాఖ్యలు

2 లో

## గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్‌కు శ్రీకారం

ఆగస్టు 1 నుంచి ఈవీ బస్సులు


భోగాపురం ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ

20 ఎలక్ట్రిక్ బస్సుల సేవలు

రెండు ప్రధాన రూట్లలో రాకపోకలు

ఏసీ, లైవ్ ట్రాకింగ్ సౌకర్యం

ప్రయాణికులకు గుడ్ న్యూస్




**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ ప్రయాణీకులతో పాటు త్వరలో అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రయాణీకుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) కీలక అడుగు వేసింది. భోగాపురం ఎయిర్ పోర్ట్ కనెక్టివిటీ కోసం ప్రత్యేకంగా పర్యావరణహిత ఎలక్ట్రిక్ (ఈవీ) బస్సుల రూట్లను రవాణా శాఖ అధికారులు తుది మార్గదర్శకాలతో ఖరారు చేశారు.

## హైదరాబాద్‌లో కలకలం

దోమలగూడలో ముగ్గురు మైనర్లు అదృశ్యం

సీసీటీవీ ఫుటేజీలతో పోలీసుల గాలింపు

కాచిగూడ, సికింద్రాబాద్ స్టేషన్లలో జాడ

ప్రత్యేక బృందాలతో ముమ్మర దర్యాప్తు

ఛత్తీస్‌గఢ్ కోణంలోనూ విచారణ

కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన

బాలికల కోసం అన్ని కోణాల్లో గాలింపు

## ఫీజుల దోపిడీపై సర్కార్ ఉక్కుపాదం

ప్రైవేటు స్కూళ్లకు విద్యాశాఖ కఠిన ఆదేశాలు

ఫీజుల వివరాలు బహిరంగ ప్రదర్శన తప్పనిసరి

జులై 30లోగా ఆడిట్ రిపోర్ట్ అప్‌లోడ్ చేయాలి

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం దిశగా అడుగులు

తల్లిదండ్రులకు భారీ ఊరటనిచ్చిన నిర్ణయం

2 లో

# ప్రజాస్వామ్యంపై దాడి: ఖర్గే



**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ ముట్టడికి యత్నించిన సీజేపీ విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై జరిగిన ఈ దాడి కేవలం వారిపై జరిగింది కాదని, నిలువెత్తు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడేనని ఆయన మండిపడ్డారు. అయోధ్య రాముడి మందిరానికి సంబంధించిన విరాళాల చోరీ అంశంపై పార్లమెంట్లో తాము స్పష్టమైన ప్రశ్నలు లేవనెత్తామని ఖర్గే తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అయోధ్య ట్రస్టు ఏర్పాటు చేసినప్పుడు అందులో ప్రధాని మోడీ కూడా భాగస్వామిగా ఉన్నారని, ట్రస్ట్ స్థాపకుల్లో ఆయన ఒకరని గుర్తుచేశారు. కోట్లాది మంది భక్తులు ఎంతో నమ్మకంతో సమర్పించిన విరాళాలు చోరీకి గురవ్వడం తీవ్రమైన విషయమేని, ఈ చోరీ ఘటనకు ప్రధాని మోడీ బాధ్యత వహించాలని ఖర్గే డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను, అక్రమాలను ప్రశ్నిస్తున్న విద్యార్థులపై, ప్రతిపక్షాలపై బలప్రయోగానికి దిగడం సరికాదని ఆయన హితవు పలికారు. మోడీ ప్రభుత్వానికి దమ్ము లేదని.. ప్రభుత్వంలో కూర్చునే అర్హత కోల్పోయారని అన్నారు.

# పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి

ఇందుకోసం చార్మినార్, బహదూర్ పురా, ముషీరాబాద్ మినహా ఇతర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించింది. గరిష్ఠ వార్షికాదాయం రూ. 6 లక్షలు, ఇల్లు, స్థలం లేకపోవడం ఈ పథకానికి ప్రధాన అర్హతలుగా ప్రభుత్వం పేర్కొంది. తొలివిడతలో నియోజకవర్గానికి 500 ప్ల?ట్ల చొప్పున నిర్మించాలని నిర్ణయించారు.

ఎక్కడ నివసిస్తే అక్కడే ఇల్లు:

ఈ పథకం ప్రారంభించిన అనంతరం మాట్లాడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. పేదవాడి చిరు కోరిక సొంత ఇల్లు అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే సొంత ఇల్లు సాకారం అవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా స్థలం ఉన్న వారికి 4.50 లక్షల ఇండ్లు ఇచ్చామని ఆగస్టు నాటికి 2 లక్షల పైగా ఇండ్లు పూర్తి కాబోతున్నాయని అన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్నామని గజం రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలు ఉన్న ప్రాంతంలో కూడా ఇండ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కోర్ పరిధిలో 30 కి.మీ దూరంగో ఇండ్లు ఇచ్చింది. ఆ అనాలోచిత నిర్ణయం వల్ల కట్టిన ఇండ్లు కూడా ఇవ్వలేకపోయారని, ఉపాధికి దూరంగా ఉండటంతో పేదలకు ఇచ్చిన ఇళ్లలో నివసించడానికి ఇష్టపడట్లేదన్నారు. కానీ మేము క్యూర్ పరిధిలోని పేదలు వారు నివసించే ప్రాంతంలోనే ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. చివరి లబ్ధిదారు వరకు ఇల్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

# ప్రభుత్వానికి వాంగ్‌చుక్ డిమాండ్లు

మొదటి పేజీ తరువాయి

మూడు డిమాండ్లు ఇవే:

ఇటీవల జరిగిన నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీలతో సహా దేశ విద్యావ్యవస్థలో జరుగుతున్న వైఫల్యాలకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని సోనమ్ డిమాండ్ చేశారు. అలాగే నీట్ పేపర్ లీకేజీల అంశాన్ని పార్లమెంట్‌లో ఖచ్చితంగా లేవనెత్తుతామని రాజకీయ నాయకులు తనకు హామీ ఇవ్వాలన్నారు. ఆరోగ్యం పరిస్థితి దృష్ట్యా కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించ తలపెట్టినపార్లమెంట్ మార్చ్‌లో తాను పాల్గొనలేకపోతే, అగ్రశ్రేణి రాజకీయ నాయకులు ఆసుపత్రికి వచ్చి పైన పేర్కొన్న షరతులపై తనకు స్వయంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత.. ఢిల్లీలో సెక్యూరిటీ టైట్:

మరోవైపు ఇవాళ పార్లమెంట్ మార్చ్ కు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. చలో సంసద్ కార్యక్రమానికి అనుమతి లేదని కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బారికేడ్లను దాటుకుని వెళ్లే ప్రయత్నం చేయగా వారిని ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు, ప్రత్యేక బలగాలు, సీజేపీ నిరసన కారుల మధ్య ఒక్కసారిగా వాగ్వాదం చెలరేగి తోపులాటకు దారి తీసింది. దీంతో పోలీసులు, ప్రత్యేక బలగాలు లాఠీచార్జ్ చేసి ఆందోళన కారులను చెదరగొట్టారు. మరోవైపు ఢిల్లీలోని మెట్రో, జేఎన్‌యూ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇతర పబ్లిక్ ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేసిన అనంతరమే వాహనాలను అనుమతి ఇస్తున్నారు.

# చార్ ధామ్ యాత్ర నిలిపివేత

మొదటి పేజీ తరువాయి

రూట్లు సురక్షితంగా లేకపోవడంతో యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు యంత్రాంగం వెల్లడించింది.

సురక్షిత ప్రాంతాల్లో భక్తులకు వసతి..

ఈ మేరకు గర్వాల్ కమిషనర్ సంబంధిత జిల్లాల మేజిస్ట్రేట్లు, ఇతర ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే యాత్ర మార్గంలో ఉన్న భక్తులను తక్షణమే గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలలో సురక్షితంగా ఉంచాలని, వారికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. రహదారులు పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని అధికారికంగా ప్రకటించిన తర్వాతే భక్తులను ముందుకు అనుమతించాలని ఆదేశించారు. యాత్రకు సంబంధించిన ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని, ఖచ్చితమైన వివరాలను మీడియా, ఇతర కమ్యూనికేషన్ ఛానెళ్ల ద్వారా భక్తులకు, సాధారణ ప్రజలకు చేరవేయాలని అధికారులకు సూచించారు.

వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, రహదారులు ప్రయాణానికి అనుకూలంగా మారి, సాధారణ స్థితికి వచ్చిన తర్వాతే చార్ ధామ్ యాత్రను తిరిగి పునరుద్ధరిస్తామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అప్పటివరకు భక్తులెవరు సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, కేవలం అధికారిక యంత్రాంగం విడుదల చేసే అడ్వైజరీలను మాత్రమే ఫాలో అవ్వాలని విజ్ఞప్తి చేసింది. వాతావరణం, రూట్ సేఫ్టీ మారేంతవరకు ఆయా జిల్లాల అధికారులు ఇచ్చే సూచనలను కచ్చితంగా పాటించాలని యాత్రికులను కోరింది.

# విరాళాల కేసుపై సుప్రీం కీలక ఆదేశాలు



**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** అయోధ్య విరాళాల చోరీ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. విరాళాల చోరీపై సమగ్ర దర్యాప్తు జరగాలని పేర్కొంది. అయోధ్య రామాలయ విరాళాల చోరీ వ్యవహారంపై సోమవారం సుప్రీంకోర్టులో సీజేఐ జస్టిస్ సూర్యాకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా నిధుల దుర్వినియోగం,ఆర్థిక అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని పునర్వ్యవస్థీకరించాలనిఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇటువంటి క్లిష్టమైన ఆర్థిక నేరాల దర్యాప్తులో మంచి అనుభవం ఉన్న ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో ఈ విచారణ జరగాలని తాము భావిస్తున్నట్లు పేర్కొంది. కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని, అయోధ్య విరాళాలపై రాజకీయాలు చేయొద్దని పార్టీలకు సూచించింది. ఈ వ్యవహారంలో సిట్ దర్యాప్తు వివరాలను యూపీ ప్రభుత్వం సమర్పించనున్న నేపథ్యంలో తదుపరి విచారణను జులై 27కు వాయిదా వేసింది.

# ఫీజుల దోపిడీపై సర్కార్ ఉక్కుపాదం




**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులను పీడిస్తూ సాగుతున్న విచ్చలవిడి ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తీవ్ర నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు స్కూళ్లు వసూలు చేసే ట్యూషన్ ఫీజుల వివరాలను కచ్చితంగా పాఠశాల నోటీసు బోర్డులతో పాటు తమ అధికారిక వెబ్‌సైట్లలో స్పష్టంగా ప్రదర్శించాలని సంచలన ఆదేశాలను జారీ చేసింది.

ఆడిట్ రిపోర్ట్ అప్‌లోడ్ తప్పనిసరి..

అయితే, కేవలం స్కూళ్ల ఫీజు వివరాలు వెల్లడించడమే కాకుండా, ప్రైవేట్ స్కూళ్లు తమ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి సీఏ ధృవీకరించిన ఆడిట్ రిపోర్టులను జులై 30లోగా విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. నిర్దేశిత గడువులోగా ఆడిట్ నివేదికలను సమర్పించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

ఫీజుల నియంత్రణకు త్వరలోనే చట్టం?

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 వేలకు పైగా ఉన్న ప్రైవేటు పాఠశాలలు ఏటా ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతుండటంతో తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ క్రమంలో పాఠశాలల్లో మౌలిక వసతులు, సౌకర్యాల ఆధారంగా ఫీజులను నియంత్రించేందుకు, అదనపు వసూళ్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొచ్చేందుకు ఓ ప్రత్యేక కమిటీ వేయాలని ఆలోచన చేస్తోంది. అయితే, విద్యాశాఖ తీసుకున్న ఈ కఠిన నిర్ణయంతో ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట పడనుంది

# డెంగ్యూకు తొలి వ్యాక్సిన్




**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** చాపకింద నీరులా వ్యాపిస్తూ దేశవ్యాప్తంగా వేలాది మందిని భయపెడుతున్న డెంగ్యూ మహమ్మారికి త్వరలోనే చెక్ పడనుంది. ప్రసిద్ధ మెడిసిన్ తయారీ సంస్థ తకేడా అభివృద్ధి చేసిన క్యుడెంగా వ్యాక్సిన్‌ను భారతదేశంలో వినియోగించేందుకు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భారత్‌లో ఆమోదం పొందిన మొట్టమొదటి డెంగ్యూ వ్యాక్సిన్ ఇదే కావడం విశేషం. అయితే, ఈ వ్యాక్సిన్‌ను 4 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఎవరైనా వేసుకోవచ్చు. అయితే, గతంలో డెంగ్యూ వచ్చిందో లేదో అని తెలుసుకునేందుకు ఎలాంటి రక్త పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదు. కేవలం మూడు నెలల వ్యవధిలో చర్మం కింద రెండు డోసులుగా ఈ వ్యాక్సిన్‌ను 0.5 ఎంఎల్ చొప్పున తీసుకోవాల్సి ఉంటుంది.

4 రకాల వైరస్‌లపై ట్రయల్ సక్సెస్..


డెంగ్యూ వ్యాధికి కారణమయ్యే నాలుగు రకాల వైరస్ రకాల (DENV 1, 2, 3, 4) పైనా ఈ టెట్రావాలెంట్ క్యుడెంగా వ్యాక్సిన్ సమర్థవంతంగా పనిచేస్తుందని గ్లోబల్, ఇండియన్ ట్రయల్స్‌లో నిర్ధారించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 40కి పైగా దేశాల్లో అందుబాటులో ఉన్న క్యుడెంగా వ్యాక్సిన్ ఆమోదంతో దేశంలో డెంగ్యూ తీవ్రత, ఆసుపత్రుల్లో చేరే పరిస్థితులు గణనీయంగా తగ్గుతాయని వైద్య నిపుణులు భావిస్తున్నారు.

# దీక్ష విరమించిన అభిజీత్ దిప్కే!

**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్న కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దిప్కే తన నిరాహార దీక్షను విరమించారు. నీట్ పేపర్ లీకేజీ పై కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని గత 20 రోజులకు పైగా నిరాహార దీక్ష చేసిన ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు బలవంతంగా సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఈ పోలీస్ చర్యను నిరసిస్తూ, విద్యార్థుల గళాన్ని నొక్కేయవద్దంటూ శనివారం నుంచే జంతర్ మంతర్ వేదికగా అభిజీత్ దిప్కే ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. తాజాగా సోమవారం ఉదయం నిమ్మరసం తాగి ఆయన తన దీక్షను ముగించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

కేంద్ర ప్రభుత్వం నుండి చర్చల ప్రతిపాదనలు వచ్చినట్లు తెలుపుతూ, తదుపరి చర్చల ప్రక్రియకు మార్గం సుగమం చేసేందుకే ఆయన తన దీక్షను తాత్కాలికంగా విరమించినట్లు సీజేపీ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలవడానికి బయలుదేరినట్లు ప్రకటించారు. అయితే, సీజేపీతో ఎలాంటి చర్చలకూ తాము పిలవలేదని జేపీ నడ్డా కార్యాలయం ఈ ప్రకటనను వెంటనే ఖండించింది. ఈ చర్చల అంశంపై అటు కేంద్ర ప్రభుత్వం మరియు ఇటు సీజేపీ మధ్య పరస్పర భిన్న ప్రకటనల నాటకం నడుస్తుండటంతో జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది.

# కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధుల భేటీ




**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** నీట్-యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన చలో పార్లమెంట్ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఆందోళన కారులపై పోలీసుల లాఠీ చార్జి చేయడంతో పరిస్థితి అట్టుడుకిపోతోంది. ఓ వైపు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగా మరోవైపు ఆందోళన కారులు పార్లమెంట్ వైపు దూసుకురావడంతో నిరసన కారులను అడ్డుకునేందుకు పోలీసులు లాఠీ చార్జ్‌తో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఆందోళనలు కొనసాగుతున్న తరుణంలోనే కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకా కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు.

ప్రభుత్వం ముందు మూడు డిమాండ్లు:

కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అనంతరం సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా మీడియాతో మాట్లాడుతూ ఇవాళ మధ్యాహ్నం మధ్యాహ్నం 2:15 గంటలకు మంత్రి నడ్డా మమ్మల్ని కలిశారని ఈ సందర్భంగా మేము ఆయన ముందు మూడు ముఖ్యమైన డిమాండ్లను ఉంచామని చెప్పారు. అందులో మొదటిది సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేసి వీడియో సందేశం ద్వారా ప్రజలను ఉద్దేశించి మాట్లాడేందుకు ఆయనకు అనుమతి ఇవ్వాలి. అసమర్థుడైన విద్యాశాఖ మంత్రిగా మేము భావిస్తున్న ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలి లేదా ఆయన రాజీనామాను ఆమోదించాలి. నీట్ (చీజుజు) పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకుని మరణించిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం అందించాలనే డిమాండ్లతో కూడిన లేఖను నడ్డాకు అందజేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రెండు విడతలుగా చర్చలు జరిగాయని మొదటిది మధ్యాహ్నం 2 గంటలకు, రెండవది సాయంత్రం 4 గంటలకు జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ డిమాండ్లపై పార్టీ అగ్రనాయకత్వంతో చర్చించి, వారి నిర్ణయాన్ని తెలియజేస్తామని నడ్డా తమకు చెప్పినట్లు వెల్లడించారు.

# గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్‌కు శ్రీకారం



**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ ప్రయాణీకులతో పాటు త్వరలో అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రయాణీకుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) కీలక అడుగు వేసింది. భోగాపురం ఎయిర్ పోర్ట్ కనెక్టివిటీ కోసం ప్రత్యేకంగా పర్యావరణహిత ఎలక్ట్రిక్ (ఈవీ) బస్సుల రూట్లను రవాణా శాఖ అధికారులు తుది మార్గదర్శకాలతో ఖరారు చేశారు. రానున్న ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సులను ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.

ఇందులో భాగంగా మొత్తం 20 ఎలక్ట్రిక్ బస్సులను విమానాశ్రయ సర్వీసులుగా నడపనున్నారు. ఈ 20 బస్సులలో ఇప్పటికే 7 బస్సులు విశాఖపట్నం నగరానికి చేరుకోగా, మిగిలిన 13 బస్సులు ఈ నెలాఖరు నాటికి డిపోకు చేరుకోనున్నాయి. ప్రయాణీకుల రద్దీ, ప్రయాణ మార్గాల డిమాండ్‌ను బట్టి ఈ బస్సులను రెండు ప్రధాన రూట్లలో విస్తరించారు. మొదటి రూట్ కింద 10 బస్సులను గాజువాక నుంచి ప్రారంభించి ఎన్.ఎ.డి. జంక్షన్ మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు నడుపుతారు. ఇక రెండవ రూట్ కింద మిగిలిన 10 బస్సులను సింధియా నుంచి ప్రారంభించి రైల్వే స్టేషన్, రుషికొండ బీచ్ రోడ్ మీదుగా భోగాపురం చేరుకునేలా కాలపట్టికను రూపొందించారు.

ఈ ఎలక్ట్రిక్ బస్సుల రాకతో విశాఖ నగరం నుంచి భోగాపురం వెళ్లే విమాన ప్రయాణీకులకు అత్యంత సౌకర్యవంతమైన, కాలుష్య రహిత ప్రయాణ అనుభూతి లభించనుంది. ముఖ్యంగా ఐటీ కారిడార్, బీచ్ రోడ్ వైపు ఉండే ప్రయాణీకులకు రుషికొండ మార్గం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. లగేజీ పెట్టుకోవడానికి ప్రత్యేక వసతులు, ఏసీ సౌకర్యం, లైవ్ లొకేషన్ ట్రాకింగ్ వంటి ఆధునిక ఫీచర్లతో ఈ బస్సులు నడవనున్నాయి. విమానాల రాకపోకల సమయాలకు అనుగుణంగా ఈ సర్వీసుల షెడ్యూల్‌ను అనుసంధానం చేయనున్నారు.

భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో, మౌలిక వసతుల కనెక్టివిటీని ముందే బలోపేతం చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగమే ఈ ఈవీ బస్సుల నిర్ణయం. ఈ బస్సుల నిర్వహణ కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్లను కూడా డిపోలలో ఇప్పటికే సిద్ధం చేశారు. ఆగస్టు మొదటి వారం నుంచి ప్రారంభం కానున్న ఈ సర్వీసులు విశాఖ నగర ప్రజా రవాణా వ్యవస్థలో కొత్త విప్లవానికి నాంది పలకనున్నాయి.

## హైదరాబాద్‌లో కలకలం...ముగ్గురు బాలికలు అదృశ్యం



**న్యూస్ డెస్క్, 20 జూలై (బిఎన్ఎస్):** హైదరాబాద్‌లో ముగ్గురు మైనర్ బాలికలు ఒకేసారి అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. దోమలగూడ ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలికలు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కార్మిక కుటుంబాలు దోమలగూడలోని ఫరీద్ బస్తీలో నివాసం ఉంటున్నాయి. అదే ప్రాంతానికి చెందిన సహిత కుమారి, స్నేహ కుమారి, లత అనే ముగ్గురు మైనర్ బాలికలు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వారి తల్లిదండ్రులు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి బాలికలు వెళ్లిన మార్గాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. విచారణలో బాలికలు మొదట హిమాయత్‌నగర్‌లో ఓ ఆటో ఎక్కినట్లు గుర్తించారు. ఆ తర్వాత వారు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో నమోదైంది. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి బాలికలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం రెండు రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ వారి కదలికలను ట్రాక్ చేస్తున్నారు.

బాలికలు తమ స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి ఉండొచ్చనే అనుమానంతో పోలీసులు ఆ దిశగా కూడా విచారణ చేపట్టారు. రైల్వే అధికారులు, ఇతర జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. మరోవైపు ముగ్గురు బాలికల ఆచూకీ ఇప్పటికీ లభించకపోవడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. బాలికలను వీలైనంత త్వరగా గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విభజనపై పోరు

మొదటి పేజీ తరువాయి

అందుకోసం ప్రత్యేకంగా ఢిల్లీకి వెళ్లి పలువురు కేంద్రమంత్రులను కలిశారు. సీఎం కోరిన అంశాలకు ప్రాథమిక ఆమోదం లభించింది. కానీ, కేంద్ర కేబినెట్ ఆమోదించాల్సి ఉంది. దాని నిర్మాణానికి రూ.17వేల కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. హైదరాబాద్-విజయవాడ హైవేకు సమాంతరంగా మరొక జాతీయ రహదారి అవసరమని, ఈ నేపథ్యంలో బందర్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేను మంజూరు చేయాలని రాష్ట్ర సర్కారు కోరింది. వరంగల్, ఆదిలాబాద్‌తో పాటు పాల్వంచ, పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ వద్ద ఎయిర్ పోర్టులు నిర్మించాలని రేవంత్ సర్కార్ కేంద్రానికి ప్రతిపాదనలు చేసింది. త్వరగా వీటిని మంజూరు చేయాలని ఇప్పటికే కోరింది. అలాగే.. రైల్వే లైన్ కనెక్టివిటీని పెంచాలని రిక్వెస్ట్ చేసింది. బోధన్-లాతూరు 128కి.మీ. రైల్వే లైన్‌పై ఇప్పటికే 2025 సెప్టెంబర్ 29న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా ఎన్ని నిధులను భరిస్తుందో తెలపాలని రైల్వేశాఖ 2025 డిసెంబర్‌లో 29న రాష్ట్రాన్ని కోరింది. అందుకు రాష్ట్రం కూడా బదులిచ్చింది. అలాగే.. పటాన్ చెరువు నుంచి ఆదిలాబాద్ వరకు 320 కి.మీ, కాచిగూడ నుంచి జగ్గయ్యపేట వరకు 250 కి.మీ, గద్వాల నుంచి డోర్నకల్ వరకు, కల్వకుర్తి నుంచి మాచర్ల 120 కి.మీ, వికారాబాద్ నుంచి కృష్ణావరకు 122 కిలోమీటర్లు, ఆర్ఆర్ఆర్ చుట్టూ రైల్వే కనెక్టివిటీ కోసం సీఎం రేవంత్ కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఆ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలని ఆయన కోరారు.

ఫండ్స్ పంచాయితీ..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 12 ఏళ్లు గడిచాయి. అయినప్పటికీ రాష్ట్ర విభజన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదు. రూ. వేల కోట్ల నిధులు బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. వివాదాలు పరిష్కారం అయితే ఈ నిధులను రాష్ట్ర ప్రజలు,ఉద్యోగుల అవసరాలకు అనుగుణంగా వాడుకునే చాన్స్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ కేంద్రం చొరవ చూపకపోవడం, ఇరు రాష్ట్రాలు ఎవరికి వారు మొండిగా వ్యవహరిస్తుండటంతో పరిష్కారం దొరకడం లేదు. దీంతో పాటు కేంద్రం విభజన చట్టంలో పేర్కొన్న హామీలను సైతం అమలు చేయడంలేదని రేవంత్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని సైతం కేంద్రం మంజూరు చేయలేదని, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం భవన శాశ్వత నిర్మాణ పనులు ముందుకుసాగడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేడియల్ రోడ్ల కోసం రూ.45 వేల కోట్లు ఇవ్వాలని మోడీ సర్కారును రాష్ట్ర ప్రభుత్వం కోరింది. గోదావరి మూసీ లింక్ ప్రాజెక్టుకు అయ్యే వ్యయంలో 25 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వ అర్బన్ చాలెజింగ్ ఫండ్ నుంచి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. అలాగే.. రాష్ట్రంలో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఐఐఎం మంజూరు చేయాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద 11 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్న విషయం తెలిసిందే.

# జీవో 396కు రద్దు చెయ్యాలి

## -రాపూరు దస్తవేజులు డిమాండ్



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):- రిజిస్ట్రేషన్ శాఖలో దస్తావేజుల తయారీని సేవా కేంద్రాలకు అప్పగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. 396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాపూరు దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం 'పెన్ డౌన్' ఆందోళన చేపట్టింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 20 నుండి 31వ తేదీ వరకు లేఖరులు విధులు బహిష్కరిస్తున్నారు. ఈ జీవో వల్ల డాక్యుమెంట్ రైటర్లు, డీటీపీ ఆపరేటర్ల జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆందోళనకు కక్షిదారులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# పోలీస్ వ్యవస్థ మారాలి.. నేరగాళ్లకు కఠిన శిక్షలు పడాలి.!!




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జులై 20: కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండున్నర ఏళ్లలో హత్యలు, అరాచకాలు, నిరంతర వేధింపులతో మన పూర్వీకులు చెప్పినట్టుగా మూడు పువ్వులు ఆరు కాయలు సామెత కాస్త, మూడు హత్యలు, ఆరు హత్యాచారాలు, నిరంతర వేధింపులు అన్నట్లుగా తయారైంది ఆంధ్రప్రదేశ్ ప్రజల పరిస్థితి అంటూ వైఎస్సార్సీపి కడపజిల్లా మహిళా అధ్యక్షురాలు తెలుగుపులి వెంకట సుబ్బమ్మ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజలందరినీ మోసం చేసి కూటమి ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి వచ్చారు అంటూనే, ముఖ్యంగా మహిళల రక్షణపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ మహిళలను ఏం చేయాలనుకుంటున్నారు అని సూటిగా ప్రశ్నిస్తూనే రోజుకో కేసు రోజుకో దారుణం ఒక ఎమ్మెల్యే స్థాయి నుంచి సాధారణ కార్యకర్త వరకు ఈరోజు మహిళలకు రక్షణే లేదు అన్నారు. మన రాష్ట్రంలో ఉన్న జనాభాలో 50 శాతం మంది ఉన్న మహిళలు రేపు పొద్దున ఎదురు తిరిగితే మీ గతి ఏమవుతుందో ఆలోచించారా అంటూ ప్రశ్నించారు. అలాగే గుంటూరు ఉదంతం లైవ్ ఉదాహరణ మొన్న గుంటూరులో ఒక మహిళ తన ఇంటి ముందు ఉన్న బోరు బావిని రిపేర్ చేయించుకుంటుంటే, తెలుగుదేశం పార్టీ సెక్రటరీ మల్లేల మూర్తి వచ్చి 10,000 లంచం అడిగాడని, ఇవ్వనందుకు ఆమెను దూషిస్తే, స్టేషన్‌కి వెళ్లి కంప్లైంట్ ఇచ్చారు అన్నారు. కానీ ఆమె గల్లా మాధవి మనుషులు అని చెప్పి పోలీసులు కేసు కూడా తీసుకోలేదు. పైగా రాత్రికి, రాత్రే తొమ్మిది మంది వాళ్ల ఫ్యామిలీ మెంబర్స్ వచ్చి ఆమహిళపై దాడి చేసి, చీర లాగితే భయంతో ఆమె దుస్తులలోని మూత్రం పోసుకునేలా దారుణంగా హింసించారు. ఇంతకంటే దరిద్రమైన ప్రభుత్వం ఎక్కడైనా ఉంటుందా అని కూటమి పాలనపై మండిపడ్డారు. ఇకపోతే బద్వేలు ఘటన వ్యవస్థపై విమర్శ చేస్తూ సామాన్యులు ఉండకూడదు, ప్రతిపక్షం ఉండకూడదు, ఎంతసేపూ తెలుగుదేశం వాళ్లే సంపాదించుకోవాలా, వాళ్లే వేధించాలా, మొన్న బద్వేలులో కూడా ఎవరో ఇద్దరు కొట్టుకుంటే తెలుగుదేశం వాళ్లకు అక్కడ ఏం పని అంటూ ప్రశ్నించారు. న్యాయం చేయాల్సింది పోయి ఒక వర్గాన్ని కొట్టి హింసిస్తారా అన్నారు. కాబట్టి పోలీస్ వ్యవస్థ మారాలి, నేరగాళ్లకు కఠిన శిక్షలు పడాలి అంటూ రాష్ట్ర మహిళలను హెచ్చరిస్తూ మహిళలారా ఎవరికి ఏకష్టం వచ్చినా మనమంతా గుమ్మిగూడి ఎదురుతిరగాలి. అరాచక శక్తులపై తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి, అందరం జాగ్రత్తగా ఉందాం. అంటూ ఆంధ్రప్రదేశ్లోని మహిళలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కడపజిల్లా మహిళా అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ పిలుపునిచ్చారు.

# చేనేతలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జులై 20:రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో చెనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డక్కా ఓబులేసు, వీరణాల. శివ నారాయణ తెలుపుతూ జమ్మలమడుగు పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం చేనేత లకు అనేక హామీలు ఇచ్చారని అన్నారు. ముఖ్యంగా నేతన్న నేస్తం ను నేతన్న భరోసా కింద 25 వేలు ఇస్తామని అన్నారు. కానీ ఇంత వరకు అది అమలు కాలేదు అన్నారు. అదే విధంగా చేనేతలకు ప్రతి కుటుంబానికి 3 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని చెప్పారని, అది అమలు కాలేదని అన్నారు. ఇప్పటికే చేనేతలు ప్రభుత్వం ఆర్థిక చేయూత కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. అటు కేంద్రం ఇటు రాష్ట్రం రెండు చేనేతలను విస్మరిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమాలకు అర్జీలు పెట్టుకోవాలంటే గుర్తింపు కార్డులు అడుగుతున్నారని గత కొన్ని సంవత్సరాలుగా గుర్తింపు కార్డులు ఇవ్వలేదని అన్నారు. చేనేతలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. ఎటువంటి షరతులు లేకుండా వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలని ఆర్థిక చేయుతనివ్వాల అన్నారు. చేనేతల సమస్యల పరిష్కారం కోసం రాబోవు రోజులలో పోరాటాలు సాగిస్తామని తెలిపారు. ఈ

కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు కొండయ్య, లక్ష్మీ నారాయణ, సంజీవరాయుడు, శేషయ్య, రామయ్య, వెంకటసుబ్బమ్మ , వసంత, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పి4లో భాగంగా హస్తకళాకారుల సాధికారతకు చౌపాల్ కార్యక్రమం

## 120 మంది గ్రామీణ హస్తకళాకారుల నమోదు, ప్రభుత్వ పథకాలు, మార్కెట్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జులై 20: స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో భాగంగా, పి 4 పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్షిప్ కార్యక్రమం ద్వారా గ్రామీణ హస్తకళాకారులను ప్రోత్సహించి వారి జీవనోపాధిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో, భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్ హస్తకళలు కార్యాలయం, హస్తకళల సేవా కేంద్రం, తిరుపతి సహకారంతో సోమవారం మైదుకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ కార్యాలయంలో చౌపాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వోనిపెంట, పెద్దసెట్టిపల్లి, అక్కులాయపల్లి గ్రామాలకు చెందిన సుమారు 120 మంది హస్తకళాకారులు హాజరై నూతన కళాకారులుగా నమోదు చేసుకున్నారు. ఈ నమోదు ద్వారా ప్రభుత్వ హస్తకళల సంక్షేమ పథకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో పాల్గొనే అవకాశాలు, అలాగే ఇతర ప్రోత్సాహకాలు పొందేందుకు వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మైదుకూరు ఎంపీడీఓ కెవి. శ్రీధర్ నాయుడు మరియు యంగ్ ప్రొఫెషనల్ వినోద్ కుమార్ పువ్వాడి మాట్లాడుతూ.. వికసిత్ భారత్ మరియు స్వర్ణాంధ్ర 2047 ఆశయాలకు అనుగుణంగా ఒక కుటుంబం ఒక పరిశ్రామికవేత్త అనే లక్ష్య సాధనలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని హస్తకళాకారులను గుర్తించి, ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేయడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. అదేవిధంగా, సంప్రదాయ హస్తకళలను పరిరక్షించడంతో పాటు వాటిని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. పి 4 కార్యక్రమం ద్వారా ప్రభుత్వ శాఖలు, ఆర్థిక సంస్థలు, మార్గదర్శులు మరియు ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ కుటుంబాలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడం స్వర్ణాంధ్ర 2047లో నిర్దేశించిన ప్రధాన లక్ష్యాలలో ఒకటని వివరించారు. ఈ కార్యక్రమంలో పి 4 మార్గదర్శి మరియు ఓనిపెంట బ్రాస్ ఇండస్ట్రీ అధ్యక్షులు ఇస్మాయిల్, హస్తకళల సేవా కేంద్రం, తిరుపతి ప్రాంతీయ సహాయ మేనేజర్ వినోద్ దెహారు, లేపాక్షి మేనేజర్ ఎఫ్ఎం. హుస్సేన్,కడప, ఎస్బీఐ ఓనిపెంట శాఖ మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొని హస్తకళాకారులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు హస్తకళల అభివృద్ధికి అందుబాటులో ఉన్న సేవలపై సమగ్ర అవగాహన కల్పించారు.

# ఆధ్యాత్మికతకు కాదు క్రీడలకు కూడా తిరుపతిని నిలయం చేస్తాను.

## మంత్రి అనగాని సత్య ప్రసాద్.



అమరావతి ,బిఎన్ఎస్ జూలై 20 : ఆధ్యాత్మికతకు నిలయమైన తిరుపతి జిల్లాను, అథ్లెట్స్ జిల్లాగా అభివృద్ధి చేస్తానని రెవిన్యూ శాఖ మంత్రి అనగానే సత్య ప్రసాద్ అన్నారు. ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహక దిశలో విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు సరికొత్త ప్రణాళిక సిద్ధం చేసిందని. అందులో భాగంగా ప్రతిభ పాటవాలు కలిగిన 258 మంది విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించినట్లుగా తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన "షైనింగ్ స్టార్స్--2026" ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యావంతుడు, దూరదృష్టి కలిగిన నాయకుడు విద్యాశాఖ మంత్రిగా ఉంటే విద్యారంగంలో ఎంతటి మార్పులు సాధ్యమవుతాయో "షైనింగ్ స్టార్స్" కార్యక్రమమే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఒకప్పుడు దేశంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్ర విద్యా వ్యవస్థ గత ప్రభుత్వ హయాంలో వెనుకబడిందని, అయితే ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగాన్ని సవాల్‌గా స్వీకరించి సంస్కరణలను వేగవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడం, నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం పునరుద్ధరణ, 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ వంటి కార్యక్రమాలు విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని వివరించారు.తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను కూడా నిర్మించబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, తిరుపతి, రైల్వే కోడూరు, సూళ్లూరుపేట,ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అరవ శ్రీధర్, నెలవల విజయశ్రీ, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, ఆర్.ఐ.ఓ గోపాల్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు నరసింహ యాదవ్, సి.ఆర్. రాజన్, సదాశివం, ప్రజాప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వార్త రాసిన జర్నలిస్టుకే నోటీసులా...?

## వెంకటాచలం పోలీస్ స్టేషన్ ముట్టడించిన జర్నలిస్టుల జేఏసీ

## పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ భగ్గుమన్న మీడియా..

## "పోలీస్ స్టేషన్ ముట్టడించిన మీడియా.. పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ నిరసన"

నెల్లూరు జిల్లా వెంకటాచలం(బిఎన్ఎస్):-వెంకటాచలం పోలీస్ స్టేషన్ లాకప్ ఘటనపై వార్తలు ప్రసారం చేసిన ఓ జర్నలిస్టుకు పోలీసులు నోటీసులు జారీ చేశారనే సమాచారం జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ చర్యను పత్రికా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణిస్తూ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మీడియా ప్రతినిధులు సోమవారం వెంకటాచలం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. "వార్త రాయడం నేరమా?", "నిజాలు చెబితే నోటీసులా?", "జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నాలు మానుకోవాలి" అంటూ పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండించిన జర్నలిస్టు నాయకులు, ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు. జర్నలిస్టుల జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు వాస్తవాలను చేరవేయడం మీడియా ధర్మమని, వార్తలపై అభ్యంతరాలుంటే చట్టబద్ధ మార్గాల్లో స్పందించాల్సిందిపోయి జర్నలిస్టులపై నోటీసులు, వేధింపులు సరికాదన్నారు. ఇలాంటి చర్యలు మీడియాను భయపెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. లాకప్ ఘటనపై ఇప్పటికే ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపి నిజాలను బయటపెట్టాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం వల్ల ప్రజల్లో మరింత అనుమానాలు పెరుగుతాయని పేర్కొన్నారు. నిరసన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా, కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం జర్నలిస్టు జేఏసీ ప్రతినిధులు పోలీసు అధికారులకు వినతిపత్రం అందజేసి, జర్నలిస్టుకు జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించడంతో




పాటు లాకప్ ఘటనపై నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

# సిఐ విద్యాసాగర్ తనయుడికి ఎస్పీ, అభినందనలు



రావులపాలెం (బీఎన్ఎస్)జూలై :20 ప్రతిష్టాత్మకంగా జరిగే జేఈఈ మెయిన్స్ లో ఆలిండియావ1001 ర్యాంకు సాధించడమే గాక ఏపీ ఎంసెట్ లో 99 వ ర్యాంకు సాధించిన రావులపాలెం రూరల్ సిహెచ్ విద్యాసాగర్ తనయుడు రుచిత్ సాయికి అభినందనలు వెల్లువెత్తాయి. దేశంలోనే ప్రసిద్ధి చెందిన మద్రాస్ ఐఐటీలో సీటు దక్కించుకున్న సాయి ని సోమవారం పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లు శాలువాలతో సత్కరించి అభినందించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ ఎమ్.మహేంద్ర, కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ తదితరులు సాయిని అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే ఆణిముత్యం లాంటి తనయుడు కలిగిన విద్యాసాగర్ కు కూడా వీరంతా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# రాపూరు గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారి!

## జ్ఞాన దేవాలయాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది!

## శిథిలావస్థలో గ్రంథాలయాలు... గత ప్రభుత్వంపై : మేకపాటి శాంతికుమారి ధ్వజం



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):-నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారి సోమవారం రాపూరు గ్రేడ్-2 గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ భవనంలోని ప్రతి గదిని తనిఖీ చేసి భవనం శిథిలావస్థలో ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.గ్రంథాలయంలో భద్రపరిచిన పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే అధ్యయన సామగ్రి, రోజువారీ వార్తాపత్రికలు, పాత పత్రికల రికార్డులు, పుస్తకాల పంపిణీ రిజిస్టర్లు తదితర వివరాలను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ అధికారులతో సమావేశమై గ్రంథాలయంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాపూరు గ్రంథాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, వర్షాలు కురిసిన ప్రతిసారి పైకప్పు నుంచి నీరు కారి పుస్తకాలు, వార్తాపత్రికలు తడిసి పాడవుతున్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగార్థులు, పాఠకులు ఎంతో ఆశతో గ్రంథాలయానికి వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరమని అన్నారు. జ్ఞానాన్ని అందించే గ్రంథాలయం ఈ స్థితికి చేరుకోవడం విచారకరమని పేర్కొన్నారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ఆమె విమర్శలు గుప్పించారు. ఐదేళ్ల పాలనలో జిల్లాలోని ఒక్క గ్రంథాలయానికైనా సరైన మరమ్మత్తులు చేపట్టారా అని ప్రశ్నించారు. గ్రంథాలయాల అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకున్నప్పటికీ వాస్తవానికి ఒక్క భవనాన్ని కూడా అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.నెల్లూరు జిల్లాలో మొత్తం 62 గ్రంథాలయాలు ఉండగా, వాటిలో ఒకటి లేదా రెండు మాత్రమే మెరుగైన స్థితిలో ఉన్నాయని, మిగిలిన గ్రంథాలయాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. అనేక చోట్ల పైకప్పులు దెబ్బతినడం, గోడలకు పగుళ్లు రావడం, వర్షపు నీరు లోపలికి చేరడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలను ఎలా వినియోగించుకోగలరని ప్రశ్నించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్య, జ్ఞానం, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాల పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన మరమ్మత్తులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.గ్రంథాలయాలు కేవలం పుస్తకాలను భద్రపరిచే భవనాలు మాత్రమే కాదని, సమాజానికి జ్ఞానాన్ని పంచే దేవాలయాలని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు, సాధారణ ప్రజలకు జ్ఞానాన్ని అందించే పవిత్ర స్థలాలను నిర్లక్ష్యం చేయడం సమాజ భవిష్యత్తును నిర్లక్ష్యం చేసినట్లేనని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్’ నూతన వాహనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, జూలై 20:-రాష్ట్రంలో మాతా--శిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోన్న ప్రభుత్వం... గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవల్ని అందించేందుకు కొత్తగా ‘తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్’ వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ వాహనాలను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోసం సిద్ధం చేసిన వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, తల్లి--శిశువులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఈ సేవలపై స్పష్టమైన అవగాహన కలిగేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన బ్రాండింగ్ డిజైన్లకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఈ వాహనాలతో రవాణా సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రత్యేక వాహనాలను వినియోగించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది బాలింతలు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

వాహనాల్లో తల్లీ--శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. వెనుక సీట్లలో సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి వాహనంలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణకు అవకాశం కల్పించారు. వాహనాల పరిశీలన సందర్భంగా అధికారులు కార్యక్రమం అమలు విధానం, వాహనాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా సేవల విస్తరణపై ముఖ్యమంత్రికి వివరించారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి,



రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటి సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, ఆ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) అధికారులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండానే పనులు


## అధికారుల ఫిర్యాదుతో కేసులు నమోదు .



అయినవిల్లి (బిఎన్ఎస్)జూలై :20 కాలువలపై అనుమతులు లేకుండా పనులు చేస్తున్న కాంట్రాక్టర్ పై అయినవిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరి పెదపాలెం ప్రధాన పంట కాలువలో ఒక ప్రైవేట్ గుత్తేదారు సంస్థ అనుమతులు లేకుండా రిటర్నింగ్ వాల్ పనులు చేపట్టారు.. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఇరిగేషన్ శాఖా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సదరు కాంట్రాక్టర్, ఆర్ అండ్ బి శాఖ అధికారిపై కేసు నమోదు చేసినట్లు అయినవిల్లి ఎస్ఐ జ్యోతి తెలిపారు.. సుధారామ కన్స్ట్రక్షన్ (కాంట్రాక్టర్ ) పి పద్మరాజు, ఆర్ అండ్ బి డి ఈ నిక్కీ క్రూజ్ ల పై Cr.NO.85/2026 U/Sec: 326(a), 326(b), 326 (C) r/w3(5) BNS క్రింద నమోదు చేసినట్లు తెలుస్తోంది.. ఇదే విషయంపై ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఫిర్యాదులు రావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.. రైతుల కు ఇబ్బంది కలిగించే విధంగా, అనుమతులు, నాణ్యత లేకుండా పనులు చెప్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం..

# సినిమా న్యూస్

# రాసా గుమ్మాడి రిలీజ్



మెగా హీరో వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో రాబోతున్న లేటెస్ట్ మూవీ ‘కొరియన్ కనకరాజు’. రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్న ఈ సినిమా ఆగస్టు 7న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన గ్లింప్స్, టీజర్, ఫస్ట్ సింగిల్ సూపర్ టాక్‌ను దక్కించుకున్నాయి. ఈ జోష్‌ను ఇలాగే కొనసాగిస్తూ.. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన సెకండ్ సింగిల్ ‘రాసా గుమ్మాడి’ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ స్వరపరిచిన ఈ ఎనర్జిటిక్ మాస్ ఫోక్ సాంగ్ వింటుంటేనే ఊపు తెప్పించేలా ఉంది. ఈ పాటకు నల్గొండ గద్దరు అందించిన మాస్ వాయిస్, ప్రముఖ లిరిసిస్ట్ కాసర్ల శ్యామ్ రాసిన పక్కా లోకల్ సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సాంగ్‌లో వరుణ్ తేజ్ ఎనర్జీ, ఆయన మాస్ లుక్ థియేటర్లలో ఆడియన్స్‌తో ఈలలు వేయించడం ఖాయంగా కనిపిస్తోంది. అలాగే ఈ పాటలో దక్ష నగార్కర్ గ్లామరస్ ప్రజెన్స్, వరుణ్ తేజ్‌తో ఆమెకున్న స్క్రీన్ కెమిస్ట్రీ సాంగ్‌ను మరింత కలర్‌ఫుల్‌గా మార్చేసింది. ఇక ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను చిత్రబృందం అనంతపురంలో చాలా గ్రాండ్‌గా నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ‘కొరియన్ కనకరాజు’ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం అనంతపురం పరిసర ప్రాంతాల్లోనే జరిగిందని, అందుకే ఈ స్పెషల్ మాస్ సాంగ్‌ను కూడా అక్కడి ప్రజల మధ్యే రిలీజ్ చేయాలని చిత్రబృందం ముందే ప్లాన్ చేసుకుందని చెప్పారు. అనుకున్నట్లుగానే అనంతపురంలో ఈ పాటను విడుదల చేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, ఈ మాస్ ఫోక్ సాంగ్ అందరికీ కచ్చితంగా నచ్చుతుందని వరుణ్ తేజ్ అన్నారు. ప్రస్తుతం ఈ పాటకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాను షేక్ చేస్తూ భారీ వ్యూస్‌ను రాబట్టుకుంటోంది.




# ఓటీటీలో సమంత జోరు

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తాజాగా ‘మా ఇంటి బంగారం’ చిత్రంతో ప్రేక్షకులను పలకరించి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు వసూలు చేసి, ఇప్పటివరకు ఏ తెలుగు లేడీ ఓరియెంటెడ్ చిత్రం సాధించని స్థాయి వసూళ్లను రాబట్టి అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన ఈ చిత్రం కొన్ని రోజుల క్రితం జియో హాట్‌స్టార్ ఓటీటీలోకి అడుగుపెట్టింది. అక్కడ కూడా ఈ సినిమా రికార్డుల పరంపరను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.


తాజాగా జియో హాట్‌స్టార్ సంస్థ ‘మా ఇంటి బంగారం’ ఓటీటీలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తోందని, ఈ సినిమాతో సమంత మరోసారి పలు అరుదైన ఘనతలను అందుకుంటోందని ప్రకటించింది. దీంతో ఈ చిత్రం థియేటర్లలోనే కాకుండా ఓటీటీలోనూ తన సత్తా చాటుతూ విజయవంతంగా దూసుకుపోతోందని చెప్పవచ్చు. నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వురు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

# టాక్సిక్ నుంచి సర్‌ప్రైజ్

కన్నడ స్టార్ యష్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘టాక్సిక్’ విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఇటీవల విడుదలైన ‘తబాహీ’ పాట సోషల్ మీడియాలో హల్చల్ చేయడంతో సినిమా చుట్టూ మరింత హైప్ ఏర్పడింది. ఇప్పుడు అదే జోష్‌ను కొనసాగించేలా చిత్రబృందం మరో కీలక అప్‌డేట్‌తో వస్తోంది. ఈ మూవీకి సంబంధించిన రెండో పాట రిలీజ్ కు రంగం సిద్ధమవుతుండటంతో అభిమానులు కూడా ఈ సారి వచ్చే పాట ఏ టైప్ లో ఉంటుందో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సమాచారం ప్రకారం, ఈ కొత్త పాటకు తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా, అర్సాన్ నిజామీ సంగీతం అందించగా, ప్రముఖ గాయకుడు సిద్ధార్థ్ బస్రూర్ స్వరాన్ని అందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వైరల్ అయిన ‘తబాహీ’ పాటలో యష్ సరసన కియారా అద్వానీ కనిపించగా, ఈసారి మాత్రం పూర్తిగా భిన్నమైన కాన్సెప్ట్‌తో రూపొందించిన పాటలో తారా సుతారియా యష్‌తో జతకట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాటను రేపే విడుదల చేయబోతున్నట్లు తెలుస్తోంది.

ఇక పాటతో పాటు సినిమా ట్రైలర్ గురించిన వార్తలు కూడా అభిమానులను ఉత్సాహపరుస్తున్నాయి. చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాకపోయినా, 2026 ఆగస్టు 8న ‘టాక్సిక్’ ట్రైలర్‌ను విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. ట్రైలర్ విడుదలతో సినిమా కథ, యష్ పాత్రకు సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అంశాలు బయటపడే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.



ఈ మూవీకి జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో యష్‌తో పాటు రుక్మిణి వసంత్, నయనతార, హుమా ఖురేషి, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, బాలాజీ మనోహర్, అమిత్ తివారీ, సూరజిత్ గోపీనాథ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తుండగా, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ తరఫున యష్ కూడా నిర్మాణంలో భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. సంగీత విభాగంలో రవి బస్రూర్ సహా పలువురు ప్రతిభావంతులైన సంగీత దర్శకులు కలిసి పనిచేస్తుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ‘కేజీఎఫ్’ తర్వాత యష్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా ‘టాక్సిక్’ ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ బజ్ ను క్రియేట్ చేసింది. ఒక్కో అప్‌డేట్‌తో సినిమాపై ఆసక్తి పెరుగుతుండగా, ఇప్పుడు రెండో పాట, ఆ తర్వాత ట్రైలర్ ను చూసేందుకు అభిమానులు కూడా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.

# డీసీకి క్రేజీ డీల్

ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘డీసీ’. ఇందులో వామికా గబ్బి కథానాయికగా నటిస్తుండగా, అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 7న తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లో కూడా విడుదల చేయనున్నారు. లోకేష్ కనగరాజ్ హీరోగా నటిస్తున్న తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను ఏసియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ సొంతం చేసుకున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సంస్థకు బలమైన పంపిణీ వ్యవస్థ ఉండటంతో, సినిమాకు విస్తృత స్థాయిలో థియేటర్లు లభించే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. మరి ఈ సినిమా తెలుగు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.




# సాయిలు-సుమంత్ కాంబో

‘మేము ఫేమస్’ సినిమాతో హీరోగా, దర్శకుడిగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును రాబట్టుకున్నారు సుమంత్ ప్రభాస్. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ మూవీ పెద్దగా హిట్ అందుకోలేపోయింది. దీంతో మూడేళ్లు గ్యాప్ తీసుకుని సుమంత్ ప్రభాస్ ఇటీవల ‘గోదావరి గట్టుపైన’ మూవీతో ప్రేక్షకులను అలరించారు. అయితే గత కొద్ది కాలంగా ఆయన తదుపరి చిత్రాన్ని ‘రాజు వెడ్స్ రాంబాయి’ మూవీతో ఇండస్ట్రీకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సాయిలు కంపాటీ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ విషయాన్ని నిజం చేస్తూ మూవీ మేకర్స్ నేడు పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న కొత్త చిత్రం ఈ రోజు ఒక దేవాలయంలో పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది.

ఈ వేడుకకు టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ ముఖ్య అతిథిగా వచ్చి ఫస్ట్ షాట్‌కు క్లాప్ కొట్టగా.. శేఖర్ కమ్ముల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అయితే ఈ సినిమాను శ్రీవెంకటేశ్వర బ్యానర్‌పై ప్రొడక్షన్ నం10గా శ్రీ భరత్ నారంగ్, రామ్ మోహన్ రావు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పూజా కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ‘రాజు వెడ్స్ రాంబాయి’ లాంటి సెన్సేషనల్ హిట్ ఇచ్చిన డైరెక్టర్ సాయిలు కంపాటి, సుమంత్ ప్రభాస్‌ను సరికొత్తగా చూపించబోతున్నారని టాక్. ఈ



ఇద్దరు టాలెంటెడ్ యువ నటీనటులు, సాంకేతిక నిపుణుల కాంబో సెట్ అవ్వడంతో సినిమాపై అప్పుడే మంచి అంచనాలు మొదలయ్యాయి. ఈ అప్‌డేట్ చూసిన నెటిజన్లు, అభిమానులు.. సుమంత్ ప్రభాస్ ఖాతాలో ఈసారి గ్యారెంటీగా ఒక బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ పడటం ఖాయమంటూ క్రేజీ కామెంట్లు పెడుతున్నారు.